రేపటి దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్, సత్యవేడు

జులై 9న బుధవారం జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నేతలు ప్రచారం చేశారు. గూడూరు మండల పరిధిలోని నెల్లటూరు గోగినేనిపురం, ఎపిఎస్‌బిసిఎల్ జిల్లాస్టోర్స్ హమాలీల సంఘం ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బివి రమణయ్య మాట్లాడుతూ సమ్మెలో పాల్గొనకపోతే కట్టు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. హమాలీల సంఘం అధ్యక్షులు చెముడు బోయిన రాగయ్య, నాయకులు వై.రమేష్ డి.మస్తాన్, ఎన్.జనార్ధన్ పాల్గొన్నారు. – నాగలాపురంలోఉపాధి కూలీలతో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ సమావేశం అయ్యారు. సమ్మెలో పాల్గొని మద్దతు తెలపాలన్నారు. నాగలాపురం వెస్ట్ హరిజనవాడ, వినోబా నగర్ గ్రామాల పరిధిలోని వ్యవసాయ ఉపాధి కూలీలు పాల్గొన్నారు

80,331 బంగారు కుటుంబాలకు... 'మార్గదర్శకులను' గుర్తిస్తాం..!

విజన్-2047, పి4 సర్వేపై మంత్రి అనగాని సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జిల్లా, నియోజకవర్గ విజన్ డెవలప్‌మెంట్ ప్రణాళికలను రూపొందిస్తున్నామని, రాష్ట్రంలోనే తిరుపతిని నంబర్ 1గా తీర్చిదిద్దాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ శాఖామాత్యులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాలులో డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్, పి4పై శాసనసభ్యులు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్లు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర -2047, దేశప్రధాని నరేంద్రమోడీ వికసిత్ భారత్ రూపకల్పన చేశారన్నారు. తిరుపతి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో తీసుకెళ్లేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో 46శాతం పరిశ్రమల నుంచి, 30 శాతం సర్వీసు రంగం, 18 శాతం వ్యవసాయ రంగం ద్వారా ఆదాయం వస్తోందన్నారు. పి4 విధానం ద్వారా ఆర్థికంగా స్థిరపడిన టాప్ 10 శాతం మంది, అట్టడుగున పేదరికంలో ఉన్న 20శాతం మందితో అనుసంధానం చేసే కార్యక్రమన్నారు. ఆగస్టు 15 నాటికి మార్గదర్శకులను గుర్తించి జిల్లాలోని 80,331 బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేలా తీర్చిదిద్దుతామన్నారు. జీరో పావర్టీ రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. మీడియాతో మాట్లాడుతూ తిరుపతి కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నానని చెప్పారు. 2023 -24 సంవత్సరంలో రాష్ట్రంలోనే తిరుపతి తలసరి ఆదాయం 3,08, 176 రూపాయలు ఉందని తద్వారా రాష్ట్ర తలసరి ఆదాయంలో తిరుపతి జిల్లా నాలుగవ స్థానంలో ఉన్నదని, రానున్న కాలంలో మొదటి స్థానానికి వచ్చేలా జిల్లాలోని అధికారు లందరు ఒక కార్యాచరణతో ముందుకు వెళుతున్నా రన్నారు. మామిడి రైతులకు కేజీకి నాలుగు రూపాయల చొప్పున తోతాపురి మామిడి రైతులను సబ్సిడీని అంద జేస్తున్నామన్నారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎన్నో ఏళ్లుగా ఒకే ప్రదేశంలో తిష్ట వేసిన వారిని బదిలీ చేశామన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో 80,331 మందిని బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట మండలాలకు చెందిన ఐదుగురు మార్గదర్శులు 1911 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారని తెలిపారు. శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎస్ఆర్ నిధులను ఏ గ్రామానికి ఎంతమేరకు ఖర్చు చేస్తున్నారో వివరాలను ఎంఎల్ఎలకు తెలిసేలా పారదర్శకత తీసుకురావాలన్నారు. సత్యవేడు ఎంఎల్ఎ కె.ఆదిమూలం మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో దబ్బలమడుగు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు. తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ టెంపుల్ టూరిజం, ఎకో టూరిజానికి టూరిజం ఎక్స్‌పర్ట్‌ను నియమిస్తే బాగుంటుందని తెలిపారు. చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని మాట్లాడుతూ 1989-90లో పేరూరు సమీపంలో ఇళ్లను కట్టించామని, దాన్ని క్రమబద్ధీకరించాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ జీవోఎంఎస్ నంబర్ 30 సంబంధించి 2019కల్లా ఇల్లు కట్టుకుని ఉండి ఆ భూముల్లో అభ్యంతరాలు లేకుంటే వాటిని రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. 150 చదరపు అడుగుల వరకూ ఎలాంటి రుసుము ఉండదన్నారు. మహిళా వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫ్యాషన్ టెక్నాలజీ స్టార్టప్ విద్యార్థులకు నైపుణ్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, జడ్‌పిసిఇఒ రవికుమార్, డిఆర్ఒ నరసింహులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వాలని కళాకారుల నిరసన

ఇంటి స్థలాలు చూపాలని కళాకారుల ధర్నా

ప్రజాశక్తి - దొరవారిసత్రం

గతంలో ఇచ్చిన ఇంటి పట్టాలకు సంబంధించి స్థలాలను అధికారులు చూపించేంత వరకూ పోరాటం ఆగదు' అని కళాకారులు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పట్టాలకు ఇంటి స్థలాలు చూపాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ దొరవారిసత్రం మండల పరిధిలో దాదాపు వంద మంది కళాకారులు ఉన్నారని, వారికి గతంలో సర్వే నంబర్ 44లో ఇంటి నివాసం పట్టాలను మంజూరు చేశారన్నారు. అప్పట్లో కొంతమంది స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకోవాలని కళాకారులు స్థలాల్లోకి వెళుతుంటే ఫారెస్టు, రెవెన్యూ అధికారులు ఆ స్థలంలోకి పోనీకుండా అడ్డుకుంటున్నారన్నారు. స్థలాలు చూపించేంత వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు. గ్రామాల్లో వీధినాటకాలు వేసి, నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, వారి సేవను గుర్తించి ప్రభుత్వం స్థలాలు చూపి ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. గ్రామీణ విద్యార్థులకు విద్యను దూరం చేసేలా 'పాఠశాలల విలీనం' ప్రక్రియను నిలిపేయాలన్నారు. ఈ విషయమై తహశీల్దార్ శైలకుమారి మాట్లాడుతూ వారంరోజుల్లో పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఎస్ఐ అజయ్‌కుమార్; సిఐటియు జిల్లా కమిటి సభ్యులు శివకవి ముకుందా, మునెయ్య, వీరాస్వామి, ప్రభాకర్, రఘు పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో చర్చిస్తున్న నేతలు

అంధుల ప్రతిభకు అనువైన వేదికలు సిద్ధం చేయాలి : జేసీఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

క్రీడల్లో రాణించేందుకు అంధత్వం అడ్డుకాదని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ - ఇండియా అంతర్జాతీయ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎన్ బి హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తుమ్మలగుంట కెవిఎస్ పార్క్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అంధుల క్రికెట్ పోటీల ప్రారంభం సందర్భంగా ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు అయిన ఆయన మాట్లాడుతూ అంధులు అనేక రంగాలతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇన్ ఏపీ డేవిడ్ జాన్, భారత జాతీయ అంధ క్రికెట్ జట్టు కెప్టెన్ అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధులు అన్ని విధాలా సమర్థులని తెలిపారు. సరైన మార్గదర్శనం, శిక్షణ, అవసరమైన వనరులు అందితే వారు అంతర్జాతీయ స్థాయిలోనూ రాణిస్తారని చెప్పారు. క్రీడలు శక్తిని మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కారణంగా అంధులకు ప్రత్యేక క్రీడా మైదానాలు, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్ర నుండి ఆరు జిల్లాల జట్లు ఇందులో పాల్గొంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ తిరుపతి శాఖ చైర్మన్ శేష సాయి, గట్ల ఫౌండేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, దివ్యంగ సేవా క్షేత్రం ప్రెసిడెంట్ ముని లక్ష్మి క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆగస్టు వరకూ మామిడి రైతులను ఆదుకుంటాం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని మామిడి రైతులను ప్రభుత్వం అన్నివిదాలా ఆదుకుంటుందని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు 80వేల హెక్టార్లలో తోతాపురి మామిడిని 76,700 మంది రైతులు పండించారన్నారు. తిరుపతి జిల్లాలో 14,582 హెక్టార్ల విస్తీర్ణంలో 1.45 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఉత్పత్తి అయ్యిందన్నారు. మామిడి గుజ్జు ప్రాసెసింగ్ 8 యూనిట్లు, 39 ర్యాంపులు, మూడు మండీలు ఉన్నాయన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం 1.21 లక్షల మెట్రిక్ టన్నులన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జూన్ 5న జరిగిన సమీక్షా సమావేశంలో కిలోకు రూ.12 ఇవ్వాలని నిర్ధారించామన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద రూ.130 కోట్ల కేంద్ర వాటాను విడుదల చేయాలని కోరుతూ రైతుసంక్షేమ మంత్రి, కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. జులై 5 నాటికి తిరుపతి జిల్లాలో 67,988.68 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను సేకరించామన్నారు. 10,046 మంది రైతులకు గణనీయంగా ప్రయోజనం చేకూరిందన్నారు. మొత్తం 45,338.03 మెట్రిక్ టన్నులను ప్రాసెసింగ్ యూనిట్లలో సేకరించగా, 22,650.65 మెట్రిక్ టన్నులను ర్యాంప్‌లు, మండీలలో విక్రయించారన్నారు. టోకెన్ వ్యవస్థ, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టంను ఉపయోగించి వ్యవస్థీకృత పద్ధతిలో సేకరణ, అన్‌లోడ్ పద్ధతిని రైతులకు తెలపడం, సేకరణ కేంద్రాల్లో ఆహారం, స్నాక్స్, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. ఈ సదుపాయం ఆగస్టు వరకూ అమలు చేయాలని రైతులు కోరారన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 11 మంది తమ సమస్యలు తెలుపగా, 24 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి ఉన్నారు.

రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆనందరాజు మృతి

ప్రజాశక్తి -తిరుమల రాజు వేగేశ్న ఫౌండేషన్ వేగేశ్న ఆనందరాజు (67) మృతి చెందారు. ఫౌండేషన్ ద్వారా ఆయన అందించిన సేవలు టిటిడిలో భారీగా ఉన్నాయి. టిటిడి లాంటి ధార్మిక సంస్థకు ఆనందరాజు మృతి తీరని లోటు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలోని పెదవాల్తేర్ డాక్టర్స్ కాలనీలో ఆదివారం తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఫౌండేషన్ నిర్వహణలో ఆనందరాజు కీలకంగా వ్యవహరిస్తూ.. సౌకర్యాల కల్పనకు రూ.కోట్లు వెచ్చించారు. రూ.77 కోట్లతో తిరుమలలో అన్నదాన సత్రం, రూ.27 కోట్లతో నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణకు ఏటా రూ.1.50 కోట్లు ఇస్తున్నారు. షిర్డీలోనూ నీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. తిరుపతి, ద్వారకా తిరుమలలో ఆసుపత్రులు నిర్మించారు. ఆయన స్వస్థలమైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గణపవరంలో ఆరు ఎకరాల స్థలం కొనుగోలు చేసి.. పేదలకు ఇళ్ల స్థలాలు అందించారు.

విద్యార్థులు దేశభక్తిని అలవరచుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని, మన్యం ప్రజల కోసం ప్రాణాలను అర్పించిన త్యాగధనుడని, విద్యార్థులు సైతం దేశభక్తిని అలవరచుకోవాలని చైతన్యభారతి స్కూలు కరస్పాండెంట్ జనార్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వసుధ, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ అన్నారు. ఆదివాసీ గిరిజనులపై బ్రిటీష్‌వారు చేస్తున్న దాష్టీకాన్ని, దోపిడీని ఎదిరిస్తూ, ఆదివాసీలను చైతన్యపరుస్తూ బ్రిటీష్‌వారి గుండెల్లో సింహస్వప్నమై నిలిచాడన్నారు. పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మారన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం తిరుపతి ఆధ్వర్యంలో 128వ అల్లూరి సీతారామరాజు జయంతి జరిగింది. ఈ కార్యక్రమంలో ఒ.వెంకటరమణ, మణికంఠ పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల మానవహారం

ప్రజాశక్తి - వెంకటగిరి

జీవో నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచాలని వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటిపిలుపు మేరకు జీతాలు పెంచాలని, సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. రాజకీయ పలుకుబడితో గత పదేళ్లుగా వెంకటగిరిలోనే తిష్టవేసి విధులు నిర్వహిస్తున్న రామారావును వెంటనే బదిలీ చేయాలన్నారు. కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, కార్మికులను తీసేస్తామని బెదిరిస్తూ 12 గంటల వరకూ డ్యూటీ చేయిస్తున్న రామారావుపై కేసు నమోదు చేయాలన్నారు. ఉదయం 10 గంటల వరకూ డ్యూటీ చేయాల్సి ఉండగా, 12 గంటల వరకూ పనులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. గత 18 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రామారావును బదిలీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, నాయకులు ప్రసాద్, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యాన్ని అరికట్టండి : జెవివి

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

సూళ్లూరుపేట కీర్తి ఎన్క్లేవ్ సమీపంలో లతీకా హోటల్ ఎదురుగా కాళంగి నదిలో చుట్టుపక్కల ప్రాంతాల కంపెనీల ప్లాస్టిక్ వ్యర్థాలను డంపింగ్ చేసి తగలబెడుతున్నారు. దీనివలన వాతావరణం కాలుష్యం అవుతూ, పొగతో చుట్టుపక్కల వున్న కాలనీవాసులను రోడ్డుపై వెళుతున్న పాదచారులకు, వాహనాలకు ప్రమాదకరంగా తయారౌతూవుంది. ముఖ్యంగా కాల్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు కాళంగినదిలో కలసి నీరు విషపూరితంగా మారి ప్రజలు తీవ్ర మైన అనారోగ్యాలకు కారణం అవుతోంది. చెత్తను డంపింగ్ చేసి, వాతావరణాన్ని కాలుష్యం చేస్తూ ప్రజారోగ్యానికి హానిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జెవివి మండల కమిటి డిమాండ్ చేసింది.

చిన్నారులకు చదువును దూరం చేయొద్దు

సూళ్లూరుపేట, తడ, డివిసత్రం తల్లిదండ్రుల నిరసన / మా ఊరి బడి మాకే కావాలంటూ ఆర్డీవో కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మోడల్ పాఠశాలల నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలను విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల బడుగు బలహీనవర్గాల పేదలు బడికి దూరం అయ్యే ప్రమాదం ఉందని, మా ఊరి బడి మాకే కావాలి అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నూకలపాళ్యం, అక్కంపేట, తడ హరిజనవాడ, ఉచ్చురు, గోపాలరెడ్డిపాళ్యం, ఓబులరెడ్డివారి పాళ్యం, దొరవారిసత్రం తదితర 12 పంచాయతీల నుంచి తల్లిదండ్రులు, విద్యాకమిటీలు, గ్రామస్తులు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ 24 రోజులుగా పేదలకు విద్యను దూరం చేయొద్దంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్నామని, పాఠశాలల విలీనం వల్ల 24 రోజుల నుంచి పేద విద్యార్థులు బడికి దూరంగా ఉన్నారని, హైవేలు, కాల్వలు, వంకలు దాటి చిన్నారులు దూర ప్రాంతాలకు పంపించే ప్రమాదకర సాహసాన్ని తల్లిదండ్రులు చేయలేరన్నారు. 24 రోజులుగా పాఠశాలలకు వెళ్లకపోవడం వల్ల చిన్నారుల చదువు దెబ్బతింటుందన్నారు. తక్షణమే జిల్లా యంత్రాంగం స్పందించి చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బడిని విలీనం చేయరాదన్నారు. సిఐటియు మండల కార్యదర్శి కె.లక్ష్మయ్య సంఘీభావం ప్రకటించారు. సమస్యాత్మక పాఠశాలపై జిల్లా యంత్రాంగం నిర్ణయం చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సుమన్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద 12 పంచాయతీల గ్రామస్తుల నిరసన

వినాయకసాగర్ వాకర్స్ సభ్యులకు డిస్కౌంట్ వైద్యసేవలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా సభ్యులను, క్లబ్బులను ఏర్పాటు చేయడానికి కషి చేయనున్నట్లు ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి రాజు పేర్కొన్నారు. తిరుపతిలో శ్రీ వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి ప్రసంగించారు. డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్థాయిలో లక్షలాది మంది సభ్యులతో వాకర్స్ అసోసియేషన్ లు నిత్యం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి అన్నారు. వాకర్ సభ్యులకు వివిధ ఆసుపత్రులలో డిస్కౌంట్ వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఐఎంఏ అధ్యక్షులు ఆర్ఆర్ రెడ్డి మాట్లాడుతూ మంచి ఆరోగ్యానికి, దేహదారుఢ్యానికి నడక ముఖ్యమన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో డాక్టర్ రవి రాజు, ఆర్ఆర్ రెడ్డి, మాధవ నాయుడు, కోనేటి రవి రాజు, కష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

రక్తమోడిన పెద్దాస్పత్రి

అర్థరాత్రి రెండు గ్రూపుల బాహాబాహీ సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అందరూ నిద్రిస్తున్న వేళ అర్ధరాత్రి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి ఒక్కసారిగా ఉలిక్కి పడింది. రెండు గ్రూపులకు చెందిన యువకులు కత్తులు, కర్రలు, రాళ్ళతోటి బాహాబాహికి దిగడంతో రణరంగాన్ని తలపించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులు, వారి బంధువులపై మరో వర్గం విచక్షణా రహితంగా దాడి చేయడంతో క్యాజువాలిటీ విభాగం రక్తమోడింది. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్య, సెక్యూరిటీ సిబ్బంది తమ కళ్లెదుట ఏం జరుగుతుందో తెలియక భీతావహులయ్యారు. ప్రాణాలను రక్షించుకునేందుకు గదుల్లోకి వెళ్లి తాళాలు వేసుకున్నారు. ఈ భయానక ఘటన ఆదివారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సాక్షిగా జరిగింది. కాగా ఏరియా ఆసుపత్రి సీసీ కెమెరాలో రికార్డయిన దాడి దశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. వివరాల్లోకి పోతే..

ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని మంచినీళ్ళగుంట, వీఎంపల్లికి చెందిన యువకుల మధ్య ఆదివారం రాత్రి వాగ్వాదం జరిగింది. అగ్నిగుండ ప్రవేశం ముగిసిన అనంతరం అర్ధరాత్రి వేళ తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో మంచినీళ్ళగుంట, వీఎంపల్లికి చెందిన యువకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో మంచినీళ్ళగుంటకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. వీరిని వారి బంధువులు స్థానిక ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే అదే సమయంలో మరికొంతమందిని వెంట తీసుకొచ్చిన వీఎంపల్లి యువకులు ఏరియా ఆసుపత్రి క్యాజువాలిటీ విభాగంలోకి చొచ్చుకుని పోయి చికిత్స పొందుతున్న యువకులు, వారి బంధువులపై కర్రలు, మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. అవతలి వారు తేరుకునేలోపే దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అవతలి వర్గం కూడా తిరగబడి రాళ్లు రువ్వడంతో అక్కడ నుంచి పారిపోయారు. ఈ సమయంలో వీఎంపల్లికి చెందిన యువకుల ద్విచక్రవాహనం పట్టుబడటంతో ధ్వంసం చేశారు. పెట్రోలు పోసి తగలబెట్టే ప్రయత్నంలో ఉండగా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది వారించడంతో మానుకున్నారు.

బయటపడ్డ పోలీసు వైఫల్యం!

ఏరియా ఆసుపత్రి వద్ద రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడం వెనక పోలీసు వైఫల్యం ఉందనే విమర్శలు బాహాటంగా వ్యక్తమవుతున్నాయి. అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం ముగిసిన అనంతరం తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రెండు ప్రాంతాలకు చెందిన యువకులు కొట్టుకుని గాయపడ్డప్పుడు, వారిని చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించినప్పుడు ముందుగా పోలీసులు అక్కడికి చేరుకోవాల్సి ఉంటుంది. అయితే మంచినీళ్ల గుంటకు చెందిన యువకులు గాయపడ్డప్పుడు గానీ, చికిత్స పొందుతున్నప్పుడు గానీ పోలీసులు సకాలంలో రాలేదని చెబుతున్నారు. ఈ సమయంలోనే వీఎంపల్లికి చెందిన యువకులు మరోమారు ఏకంగా ఆసుపత్రి లోపలికి మారణాయుధాల తోటి వెళ్లి దాడి చేసే పరిస్థితి ఏర్పడింది. ప్రతిగా రెండు వర్గాలు బాహాబాహీకి దిగే పరిస్థితి కల్పించింది. సెక్యూరిటీ, వైద్య సిబ్బంది కళ్లెదుటే ఇదంతా జరుగుతున్నా ఏమి చేయలేని పరిస్థితి. ఆ సమయంలో పోలీసు టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేసినా స్పందన లేకుండా పోయిందని ఆసుపత్రి ఉద్యోగి ఒకరు చెప్పారు. తన 25 ఏళ్ల సర్వీసులో ఈ తరహా ఘటన ఎన్నడూ చూడలేదని సదరు సిబ్బంది వాపోవడం గమనార్హం. అయితే ఈ సంఘటనపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపడుతున్నట్లు శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ గొడవ జరిగినట్లు తెలుస్తోంది.

ఘనంగా యంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: యంఆర్‌పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలో పలిపాటి రవి మాదిగ ఆధ్వర్యంలో మంగళపూరి సురేష్ మాదిగ అధ్యక్షతన వెంకటగిరి, కాస్పేటలో జెండా ఆవిష్కరించారు. ఈ వేదికపైనే మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలిపాటి రవి మాదిగ, మంగళపూరి సురేష్ మాదిగలు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేసి, వర్గీకరణను సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో యంఆర్‌పిఎస్ టౌన్ అధ్యక్షుడు కందిపల్లి మణి, దళిత ఎమ్మార్పీఎస్ నాయకులు తాపాక సుధా, కొన్నెలు, వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ కౌన్సిలర్ మంచు పోలపల్లి కోటి, మారు సంస్థ చిగురపాటి పవన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పెళ్లి మండపం కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. తిరుపతి జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు ఈర్ల రాజా మాదిగ, రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ మాసారపు వెంకటసుబ్బయ్య, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్ మాదిగ, శ్రీకాళహస్తి ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు వెంకటమణి మాదిగ, మాసారపు శ్రీనివాసులు, మోహన్, జగదీష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాలలో పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా పాడి రైతులకు పశుగ్రాసాన్ని గూడూరు పశు వైద్య శాల సహాయ సంచాలకులు సురేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి మేత లేనిదే పాడి ఎప్పుడు లాభ సాటి కాదన్నారు. నాణ్యమైన పశుగ్రాసాలను పండించి శాస్త్రీయ పద్ధతుల్లో పశువులను మేపినట్లయితే అధిక పాల ఉత్పత్తి సాధిస్తూ, పాల ఉత్పత్తి ఖర్చు తగ్గించవచ్చన్నారు. పశుగ్రాసాలతో మేపిన పశువులు ఆరోగ్యంగా ఉండి, వ్యాధి నిరోధక శక్తి కలిగి ఉంటాయన్నారు. పశుగ్రాసాల్లోని రకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డివిజన్ పరిధిలోని సమస్యలు వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ రాఘ వేంద్ర మీనా తెలిపారు. గూడూరు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలనుండి వినతులు స్వీకరించారు. వచ్చిన వినతులను త్వరలో పరిష్కరిస్తామన్నారు.

గ్రామాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-ఏర్పేడు: పాపా నాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు చెల్లూరు గ్రామ ప్రజలకు సోమవారం డయేరియా, డెంగ్యు ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటి డెమో కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పిల్లలు, తల్లుల ఆరోగ్యం విషయంలో, ఆహారం విషయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. దోమలతో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ఆరోగ్య కార్యకర్త, శారద, కవిత ఆశ కార్యకర్తలు రేవతమ్మ అంగన్ వాడి కార్యకర్త పాల్గొన్నారు.

శ్మశానవాటిక హద్దులు నిర్ణయించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : పేరూరు పంచాయతీ పరిధిలోని మాదిగపల్లి, మాలపల్లి వాసులు సోమవారం తిరుపతి రూరల్ మండల తహాశీల్దార్‌కి విన్నవపత్రం సమర్పించారు. తమ గ్రామ పరిధిలో, సర్వే నంబర్ 536/3 భూమిని స్మశానవాటికగా వినియోగిస్తున్నామని, అయితే ఇటీవల కొందరు ఆ భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కబ్జాకు అవకాశం లేకుండా, 50 సంవత్సరాలుగా స్మశాన వాటికగా వినియోగిస్తున్న ఈ భూమిని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించాలని కోరారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వెస్ట్ వరత్తూరులో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ అధికారులకు సూచించారు. సోమవారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామంలో చెత్త సేకరణ కేంద్రం వద్ద గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, కాలువ లేకపోవడంతో మురుగునీరు వీధుల్లోకి వస్తుందని గ్రామస్తులు తెలుపగా, కాలువల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఎపీఎం మునెయ్య, ఎపీఓ దేవరి, తదితరులు పాల్గొన్నారు.

వెర్షన్ 2.0పై ఒక రోజు శిక్షణ

ప్రజాశక్తి - వాకాడు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి సూచిక వెర్షన్ 2.0పై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల స్థాయి అధి కారులు, అన్ని పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ సహాయ కులు, ఇంజనీరింగ్ సహాయకులు, ఏఎన్ఎంలు పాల్గొనాలన్నారు.

భరతనాట్యంలో వరల్డ్ రికార్డు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇటీవల తమిళనాడులో నిర్వహించిన అంతర్జాతీయ టైమ్స్ అండ్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో తిరుపతికి చెందిన విద్యార్థులు భరతనాట్యం కేటగిరీలో వరల్డ్ రికార్డు సాధించారని తిరుపతి గ్రామీణ మండలానికి చెందిన శ్రీ కళ్యాణి నాట్య కళాక్షేత్రం అధ్యాపకురాలు కీర్తి తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి 2000 మంది విద్యార్థులు పాల్గొనగా తిరుపతికి చెందిన సింహల లేక్షణసాయి, కందుల హవిష, బి. ప్రశ్వితశ్రీ, సి.కేతనలు ప్రపంచ రికార్డును సాధించి నిర్వాహకుల నుండి ప్రశంసా పత్రాలను అందుకున్నారన్నారు. 27 నిమిషాల 32 సెకండ్ల కాలం పాటు నటరాజస్వామి ఆకారంలో విద్యార్థులు నృత్యాన్ని ప్రదర్శించడంతో ఈ ప్రపంచ రికార్డును కైవసం చేసుకున్నారన్నారు.

సరోజనమ్మకు సన్మానం

ప్రజాశక్తి-చిల్లకూరు: మండలపరిదిలోని పెంటపాడు ప్రాథమిక పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా అంకితభావంతో, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయిని సరోజనమ్మ, తిక్కవరం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయిన సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రమేష్, సిహెచ్. వరలక్ష్మి, విధ్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండల కేంద్రంలోని బిసి సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సోమవారం జిల్లా బిసి సంక్షేమ అధికారి భరత్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తయారు చేసిన భోజనం, మెనూను పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులు వ్యక్తి గత ఆరోగ్య శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం వసతి గృహాన్ని పరిశీలించారు.

ప్రతి అర్జీకి గడువులోపు పరిష్కారం చూపాలి

జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

- ■ పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్‌తో కలిసి అర్జీలు స్వీకరించిన మంత్రి
- ■ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 284 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రతి అర్జీదారుడుకి గడుగులోపు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మాత్యులు అనగాని సత్యప్రసాద్ జిల్లా అధికారులకు సూచించారు. తిరుపతి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టరేట్లో సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతి నగరానికి చెందిన భారతి అనే మహిళ తన భర్త ప్రమాదవశాత్తు 2023 జనవరిలో చనిపోయారని తమ కుటుంబానికి ఎలాంటి ఆదాయం లేదని ముగ్గురు సంతానం అని మంత్రికి తెలిపారు. తన భర్తకు సంబంధించిన చిగురువాడ ఉత్తరపు కండ్రిక సమీపంలో ఒక ఫ్లాట్ ఉందని, తమ ప్రమేయం లేకుండా తన భర్త మరణించిన నాలుగవ రోజే వేరొకరికి ట్రాన్స్ఫర్ చేసేశారని ఫిర్యాదు చేశారు. మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లామని కానీ న్యాయం జరగలేదని చెప్పడంతో వెంటనే సంబంధిత రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను వర్చువల్ సమావేశం ద్వారా సంప్రదించి ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయవలసిందిగా ఇన్చార్జి మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, ట్రైన్ ని కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డిఆర్‌ఓ నరసింహులు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 149, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 24 అర్జీలు మొత్తం కలిపి 284 అర్జీలు వచ్చాయని అధికారులు ప్రకటించారు.

అర్జీదారులనుండి సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్రంలో కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ దివ్యాంగుల అర్జీలు స్వీకరించడానికి తానే స్వయంగా వారి ముందు వచ్చి కూర్చుని వారి సమస్యలను సావధానంగా విన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా పిడబ్ల్యుడి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా విభజింపబడ్డ తర్వాత దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో చాలా జాప్యం జరుగుతోందని, దివ్యాంగుల జీవనస్థితిగతులను మార్చడానికి ప్రభుత్వం నుండి తగిన సహకారాలను అందించడానికి మంత్రికి విన్నవించామన్నారు. త్రీ వీలర్ స్కూటీస్ దివ్యాంగులకు ఉచితంగా ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవాలని, సొంత ఇల్లు లేని దివ్యాం గులకు ప్రభుత్వమే ఇంటిని కేటాయించి నిర్మించి ఇవ్వాలని, దివ్యాంగులకు ఒక కమ్యూనిటీ హాల్ కేటాయించి ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని, ప్రభుత్వ ఆఫీసులు, పాఠశాలల వద్ద నడవలేని స్థితిలో ఉన్న వారికి వీల్ చైర్స్, వాటికి అనుగుణంగా దివ్యాంగుల కొరకు రాప్స్ నిర్మించాల్సిందిగా మంత్రిని కోరారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్, కృష్ణమ నాయుడు, అబ్దుల్లా, మధులత, సరస్వతి, మస్తాన్, రామచంద్ర, శంకర పాల్గొన్నారు.



పింఛను మంజూరు చేయాలని కోరుతూ కలెక్టరేట్‌కు వచ్చిన అయ్యర్

శ్మశానం మార్గాన్ని కబ్జా చేశారు

తిరుపతి జిల్లా, వెంకటగిరి రూరల్ పరిధిలోని వల్లివేడు గ్రామపంచాయతీలో ఉన్న స్మశాన వాటిక మార్గాన్ని కబ్జా చేశారని ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా వినియోగించుకుంటున్న మార్గాన్ని ఇప్పుడు కొంతమంది దురుద్దేశపూర్వకంగా కబ్జా చేయడంతో కర్మ క్రియలకు, దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్‌ను ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

పక్షవాతం వచ్చి బాధపడుతున్నా

గత ఏడాది డిసెంబర్ మాసంలో పక్షవాతం రావడంతో కుటుంబాన్ని పోషించడానికి ఆర్థిక స్తోమత పూర్తిగా కోల్పోయానని, పింఛను మంజూరు చేయాలని కోరుతూ తిరుపతి గ్రామీణ మండలం పేరూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన అయ్యర్ అర్జీని సమర్పించారు. మొదటగా మెడికల్ బోర్డు ధృవీకరణ పత్రాన్ని పొందాలని, అటు తర్వాత సదరం సర్టిఫికెట్ పొందిన తర్వాత పింఛను మంజూరు చేస్తామని అధికారులు చెప్పారు. తన కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను అయ్యర్ ప్రాధేయపడ్డారు.

వచ్చే పింఛను ఆగిపోయింది

పుట్టుకతో వికలాంగుడినని, గత ఐదేళ్లుగా పింఛను ఆపేసారని, తిరుపతి నగర పరిధి సుందరయ్య నగర్‌కు చెందిన మునిరాజా వినతి పత్రం సమర్పించారు. అధికారులు దయవుంచి పింఛను పునరుద్ధరించాలని అధికారులను కోరారు.

బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అన్నమయ్య జిల్లా, మదనపల్లి ప్రాంతంలో కొండపై ఉన్న గౌతమ బుద్ధుని విగ్రహ తల నరికిన ఉన్మాదులను కఠినంగా శిక్షిస్తూ, పూర్తిస్థాయి విచారణ కోరుతూ నిరసన తెలిపిన భారతీయ అంబేద్కర్ సేన నాయకులను అక్రమ పద్ధతిలో అరెస్టు చేసి కేసులు బనాయించిన ఆ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు జిల్లా కలెక్టర్‌కు మంత్రికి వినతి పత్రాన్ని అందించారు.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి బీసీల డిమాండ్ల సాధన కోసం, భవిష్యత్తు కార్యచరణను దేశవ్యాప్తంగా రూపొందించడానికి ఆగస్టు 7వ తేదీన గోవాలో జాతీయ ఓబీసీ మహాసభను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్రావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పద్మావతి అతిథి గృహంలో సోమవారం పత్రికా సమావేశం నిర్వహించారు. వారు మీడియాతో మాట్లాడుతూ జూలై 21 నుండి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుపై చర్చించి, బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడానికి బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రం జనగణనతో పాటు, కులగణన చేయడానికి ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామని, ఇదే సమయంలో కులగణనకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించి కులగణన 2026 లోనే పూర్తి చేసి మహిళా బిల్లులు బీసీ మహిళలకు సబ్ కోట జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను పెంచాలని కోరారు. సుప్రీంకోర్టు విధించిన 50% రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసి, కులగణన ఆధారంగా, జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో విద్యా, ఉద్యోగాలలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గోవాలో జరపనున్న మహాసభకు ప్రధాని మోడీని, సహా కేంద్ర మంత్రులను, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను, అఖిలపక్ష పార్టీల అధ్యక్షులను, జాతీయస్థాయి నేతలను, ఆహ్వానించునున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతి కుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్టీలకతంగా బీసీలందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొబ్బినేని రఘుపతి, సోమశేఖరాచారి, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భూముల రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం అవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దార్ శ్రీదేవి సూచించారు. సోమవారం ఆలత్తూరు, కొత్తపాలెంలో రెవెన్యూ అధికారులు రీ సర్వేచేపట్టిన భూములకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో భూముల వద్ద కు చేరుకుని సర్వే చేస్తారని తెలిపారు. నిర్వహించిన రీ సర్వే వివరాలు ఇలా ఉన్నాయి. ఆలతూరు, కొత్తపాలెం మొత్తం విస్తీర్ణం 386.78 ఎకరాలు, ఇందులో పట్టా భూములు 263.60 ఎకరములు కాగా, ఇందులో ప్రభుత్వం భూములు 123.18 ఎకరములు. ఈ భూమిలో మొత్తం గల సర్వే నంబర్లు 56. వాటికి గాను సబ్ డివిజన్ 909 మాత్రమే కాగా, ఇందులో ప్రభుత్వ ఖాతాలో 9, నేషనల్ ఖాతాలు 76 ఉన్నాయి. కాబట్టి వచ్చే వారం నుండి ఆ గ్రామంలో రీ సర్వే మొదలవుతుందని రెవెన్యూ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రాజ్‌కుమార్, విఆర్‌ఓ భాస్కర్ తదితరలు పాల్గొన్నారు.

శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన బహుళజాతి కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలను సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఈ న్‌హెచ్ కంపెనీ ప్రతినిధులు రామసుబ్రహ్మణ్య, హేమలతలు సందర్శించారు. తమ కంపెనీ ద్వారా శ్రీరామ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు జరిపి విద్యార్థులకు ప్లేస్మెంట్ కల్పిస్తామని కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డికి హామీ ఇచ్చారు. కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు చక్కగా ఉన్నాయని ప్రశంశించారు. వారిని కళాశాల డైరెక్టర్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, ప్లేస్మెంట్ ఆఫీసర్ టీ. విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ ప్రతినిధులకు జ్ఞాపిక అందజేసిన దృశ్యం

టీచింగ్ అసిస్టెంట్స్‌కు న్యాయం చెయ్యండి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న టీచింగ్ అసిస్టెంట్‌కు అన్యాయం చేయొద్దని ఇంచార్జ్ విసి ఆచార్య అప్పారావుకి అఖిలపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కలసి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో రెగ్యులర్ అధ్యాపకుల పాత్ర ఎంత ఉందో టీచింగ్ అసిస్టెంట్ పాత్ర కూడా అంతే గణనీయంగా ఉందని తెలిపారు. వారిని తొలగిస్తే వారి కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, ఎఐఎస్ఎ జిల్లా కన్వీనర్ చిన్న తదితరులు ఉన్నారు.

ఉత్కంఠలో ఎస్వీయూ తాత్కాలిక అధ్యాపకులు.. అందని రెన్యూవల్ ఆర్డర్స్

గత ఐదు రోజులుగా యస్వీయులో అకాడమిక్ పెర్ఫార్మన్స్ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీంతో వర్సిటీలో కొంతమంది తాత్కాలిక అధ్యాపకులను, పెర్ఫార్మన్స్ సరి లేని వారిని తీసివేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం అయినా అకడమిక్ కన్సల్టెంట్ల రెన్యూవల్ ఆర్డర్స్ ఇస్తారని పలువురు ఆశావాహులు ఆశిస్తున్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకునిరావాలని. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆశించారు. సోమవారం ఆయన పుత్తూరు రూరల్ మండల పరిధిలోని గోపాలకృష్ణపురంలో సుపరిపాలనలో మొదటి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కరపత్రాలను అందజేశారు. అంగన్వాడీ పిల్లలకు అక్షరాభాస్యం చేయించారు. ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ తల్లికి వందనం గురించి, అలాగే పాఠశాలలోని మౌలిక వసుతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువుల నీటి తొట్టెను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, మండల పార్టీ అధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు మండల పరిధిలోని మిఠాత్మకూరు, పగడాల పల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, మట్టం శ్రావణి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : కొత్తవీరాపురం పంచాయతీ లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమములో భాగంగా సోమవారం టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, రెడ్డివారి గురువారెడ్డి, పేరం ధనంజయులునాయుడు, పున్నారావు, బత్తల గిరి నాయుడు గారుశివశంకరరెడ్డి, సూరినాయుడు, మహేష్ రెడ్డి, ఎక్స్ ఎంపీపీ మురగయ్య, మండల తెలుగుదేశం పార్టీ నాయకుల కార్యకర్తలు కొత్తవీరపురం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహిళలకు సీఎం చంద్రబాబు వెన్ను దన్నుగా నిలుస్తున్నారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు అన్నారు. పట్టణంలోని 52 వ బూత్ పరిధిలో సుపరిపాలకు తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, గాజుల భగత్, కన్నావరం సుబ్రహ్మణ్యం, మీర్జావలి, హర్షవర్ధన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలో మంగళవారం జరగబోవు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ యువ నాయకుడు కళ్యాణ్ రెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం సంవత్సరం పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో తాల్వాయిపాడు, కానూరు రాజుపాలెం, శిరసనంబేడు, చావాలి మొదలైన గ్రామాలలో జరిగే కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వెటర్నరీ విద్యార్థులకు శుభవార్త

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని గరివిడిలో ఉన్న 'కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్'లో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలకు గానూ మూడవ, నాల్గవ సంవత్సరాల బీవీఎస్సీ, ఏహెచ్ కోర్సులు పునరుద్ధరణ గురించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చూపిన చొరవతో కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 2022 సంవత్సరం నుండి ఈ కోర్సులకు అనుమతి లేదు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత కోర్సులకు అనుమతులను పునరుద్ధరిస్తూ లేఖను విడుదల చేశారు.

తిరుపతి జిల్లా విద్యాశాఖ రికార్డు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లాలో పాఠశాలలు పున ప్రారంభమయిన తరువాత నేటి వరకు జిల్లా పరిధిలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు 100 శాతంగా నమోదయిందని, రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా ప్రథమంలో నిలిచిందని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ తెలిపారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ఆర్జెడి శ్యాముల్ మార్గ నిర్దేశంలో తిరుపతి జిల్లా పరిధిలో విద్యాశాఖ సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. ఇందుకు సహకరించిన విద్యాశాఖ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీ శంకర్రావు, ఫేషియల్ అటెండెన్స్ నోడల్ ఆఫీసర్ సురేష్‌కు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

వంద శాతం హాజరు కార్డులు చూపుతున్న విద్యాశాఖ అధికారులు

అనాధ పిల్లలను చైల్డ్ హోమ్‌కు తరలింపు

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధి, కరకంబాడిలో ముగ్గురు అనాధ పిల్లలు తిరుగుతుండగా వారిని రేణిగుంట పోలీసులు విచారించి స్టేషన్ తీసుకుని వచ్చి, వారిని మాతృశ్రీ చైల్డ్ హోమ్ వారికి అప్పగించారు. పిల్లలను విచారించగా వారు తిరుపతి, బైరాగి పట్టడ వద్ద ఉన్న మాతృశ్రీ చైల్డ్ హోమ్‌లో ఉంటూ బైరాగి పట్టెడల్లో ఉన్న సోక్రటీస్ స్కూల్‌లో చదువుతున్నామని తెలిపారు. ఇంగ్లీష్ మీడియం చదువు కష్టంగా ఉన్నందున బయటకు వచ్చేశామని తెలిపారు.

వార్డెన్లు హాస్టల్ భోజనం తినాల్సిందే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఇకపై వార్డెన్లు హాస్టళ్లలో విద్యార్థులకందజేసే భోజనాన్నే తినాలని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశపు మందిరంలో సోమవారం ఆయన ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్ళలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల శ్రీకాళహస్తిలో చోటు చేసుకున్న వరుస విషాహార ఘటనలను ఆర్డీవో ప్రస్థావించారు. మరో సారి ఇలాంటి ఘటనలు జరగకూడదని సూచించారు.

తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో సోమవారం సాయంత్రం టీటీడీ ఈవో జె.శ్యామలరావు విస్తృత తనిఖీలు నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణి, బంగారు డాలర్లు, అగరబత్తి, కొబ్బరి కాయల విక్రయ కౌంటర్లు, పబ్లికేషన్ స్టాళ్లను పరిశీలించి అధికారు లకు పలు సూచనలు చేశారు. లడ్డూ కౌంటర్, పబ్లికేషన్ స్టాళ్లు, బంగారు డాలర్ల విక్రయ కేంద్రంలో జరుగుతున్న డిజిటల్ పేమెం ట్స్‌ను పరిశీలించారు.

ఆన్ కాల్ డ్రైవర్లకు ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో ఆన్ కాల్ డ్యూటీ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ మునిచంద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నెలల హెవీ లైసెన్స్ అనుభవం కలిగి ఉండి, 40 ఏళ్ల లోపు వయస్సు వారు అర్హులని తెలిపారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం లోపు ఆర్టీసీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 99592 97947, 9063774464 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కౌటిల్య విద్యార్థులకు ఎన్.ఎల్.యూ అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, ఎమ్ఆర్ పల్లి సర్కిల్ వద్ద వున్న "కౌటిల్య ఇన్స్టిట్యూషన్" కి చెందిన విద్యార్థులుకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మక కాలేజీ దామోదర్ సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ, వైజాగ్‌లో ఐదు సంవత్సరాల బిఏ న్యాయశాస్త్రం కోర్సుకు డిగ్రీ అడ్మిషన్ సాధించారని కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ వెల్లడించారు. వీరిలో తిరుపతి శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసిన ఏ.మాధుర్య ప్రియదర్శిని, పలమనేరుకు చెందిన తలిగట్టు సుభాష్, పి.రిషి ఈశ్వర్ ప్రసాద్‌లు ప్రముఖ కాలేజీల్లో సీట్ సంపాదించారు. వీరిని కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ మరియు ఫ్యాకల్టీ అభినందించారు. ఈ క్లాట్ పోటీ పరీక్ష లకు సంబంధించి ఉచిత గైడెన్స్ కోసం కౌటిల్య ను 9698123456 ఫోన్ ద్వారా కూడా సంప్రదించవచ్చని అన్నారు

పామాయిల్ సాగుకు మొగ్గు చూపాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం : ప్రతి రైతు పామాయిల్ పంట సాగు వైపు మొగ్గు చూపాలని 3 ఎఫ్ ఆయిల్ ఫామ్ కంపెనీ ఉమ్మడి చిత్తూరు జిల్లా జోనల్ మేనేజర్ వెంకట మురళి సూచించారు. సోమవారం మండలంలోని రావిళ్ల వారిపల్లిలో రైతు చిట్టిబాబు సాగు చేస్తున్న పామాయిల్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులకు పామాయిల్ పంట సాగుకు అవ గాహన కల్పించారు.

గురుకుల పాఠశాలలో లీగల్ అవేర్‌నెస్

ప్రజాశక్తి - నాయుడుపేట: పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో, పాఠశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో లీగల్ రైట్స్ అసోసియేషన్ ద్వారా సోమవారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, యస్వీకు చెందిన న్యాయ విద్యార్థులు కోటపురి కార్తిక్, కలపాటి మహర్షి, చైతన్య, సూర్యనారాయణ, వారి బృందం పాల్గొని పౌరుల హక్కులు, న్యాయ వ్యవస్థ ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు చెంచు కృష్ణయ్య, బార్ అసోసియేషన్ మాజీ గౌరవధ్యక్షులు పార్థసారథి రెడ్డి, సీనియర్ న్యాయవాదులు సోమశేఖర్‌లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో న్యాయ సూత్రాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై స్పందన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజింగ్ న్యాచురల్ ఫామింగ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రకృతి వ్యవసాయ పంటల ప్రయోజనాలను వివరించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎలాంటి రసాయనాలు వాడకుండా పండించే కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వ్యవసాయశాఖ ఏడీ గోపీ నాయక్ తెలిపారు. గూడూరు, గ్రామోద్యోగుల భవనం వద్ద సోమవారం ఏపీసీఎన్ఎఫ్ స్టాల్‌లో కూరగాయలను విక్రయించారు.

కత్తి, కర్రలతో సైకో వీరంగం

ప్రజాశక్తి - తిరుపతి : సోమవారం తిరుపతి, అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కపిల్ తీర్థం రోడ్డులో ఓ సైకో ముగ్గురు పై దాడి చేసిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇరువురికి గాయాలయ్యాయి. దాడిలో గాయపడిన మృతుడుని శేఖర్ (55)గా గుర్తించారు. కపిలతీర్థం పార్కింగ్‌లో పనిచేసే సుబ్రహ్మణ్యం, అక్కడే ఉంటున్న కల్పనకు గాయాలు కాగా రుయా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. దాదాపు గంటసేపు స్థానికులు, పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బంది ప్రయాసలు పడి సైకోను వలవేసి పట్టుకున్నారు. ఈ సైకోను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

అనారోగ్యంతో టీటీడీ ఉద్యోగి మృతి

హేమ కుమార్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తిరుపతి : టిటిడిలో అసిస్టెంట్ షరాఫ్‌గా విధులు నిర్వహిస్తున్న హేమ కుమార్ (39) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. అతడు భార్య, నాలుగు సంవత్సరాల కుమారుడుతో కలిసి కొర్లకుంటలో నివాసం ఉంటున్నాడు. అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుని తిరిగి వచ్చి ఇంటిలో సేదతీరుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లగా అతడి భార్య గుర్తించి, స్థానికుల సహాయంతో సిమ్స్ ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృత దేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహారాజశ్రీ తిరుపతి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No. 295/2025 In O.S.No.43/2025

కె.బబిత, భర్త ప్రతాప్ రెడ్డి, ఫ్లాట్ నంబర్. 305, జె.పద్మ టవర్స్, కళ్యాణ్ జ్యువెలర్స్ వెనుక, ఆర్.టి.సి.బస్టాండ్ ఎదురుగా, కడప నగరం, వై.ఎస్.ఆర్. కడప జిల్లా.

...పిటిషనర్/వాది

Vs

షేక్ ఇషాక్ తండ్రి సి.ఎస్. మహబూబ్, డోర్ నంబర్: 6-3-297, మంచాల వీధి, తిరుపతి పట్టణం మరియు మండలం, శ్రీ బాలాజీ జిల్లా.

...రెస్పాండెంట్/ప్రతివాది

పిటిషనర్, రెస్పాండెంటు అయిన మీ పైన పిటిషన్ షెడ్యూల్ దాఖలా ఆస్తిని ఎవరికీ ఎలాంటి పరదీనం చేయకూడదని కోరి I.A.No. 295/2025 అను పిటిషన్ ను పై కోర్ట్ లో దాఖలు చేసియున్నారు. సదరు విషయమై మీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల 22.07.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు కానీ, మీ వకీలు గారి ద్వారా కానీ పైకనిన కోర్టులో హాజరై మనవి చేసుకోవలయును. లేనంతట మీ పరోక్షము నందు తీర్మానించబడునని ఖండితముగా తెలుపడమైనది.

//గౌరవ న్యాయస్థానం వారి ఆదేశం మేరకు//

ఎం. నిజాం జానీ,
వాది పరం అడ్వకేట్, రాజంపేట.

మహారాజశ్రీ తిరుపతి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.43/2025

కె.బబిత, భర్త ప్రతాప్ రెడ్డి, ఫ్లాట్ నంబర్: 305, జె.పద్మ టవర్స్, కళ్యాణ్ జ్యువెలర్స్ వెనుక, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, కడప నగరం, వై.ఎస్.ఆర్. కడప జిల్లా.

...వాది

Vs

షేక్ ఇషాక్ తండ్రి సి.ఎస్. మహబూబ్, డోర్ నంబర్, 6-3-297, మంచాల వీధి, తిరుపతి పట్టణం మరియు మండలం, శ్రీ బాలాజీ జిల్లా.

...ప్రతివాది

వాది, ప్రతివాది మీపై విక్రయ అగ్రి మెంటును తేదీ. 31.8.2023 బట్టి రిజిస్టర్ చేయించమని కోరి, పై గౌరవ కోర్ట్ లో దావా దాఖలు చేసియున్నారు. సదరు విషయమై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 22-07-2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు కానీ, మీ వకీలు గారి ద్వారా కానీ పైకనిన కోర్టులో హాజరై మనవి చేసుకోవలయును, లేనంతట మీ పరోక్షము నందు తీర్మానించబడునని ఖండితముగా తెలుపడమైనది.

//గౌరవ న్యాయస్థానం వారి ఆదేశం మేరకు//

ఎం. నిజాం జానీ,
వాది పరం అడ్వకేట్,
రాజంపేట.